# బంగారు పిచ్చుక

రాత్రి తొమ్మిదింటికి రావల్సిన కోణార్క్ వచ్చేసరికి పన్నెండవుతుందట! ప్లాట్ ఫారమంతా జోగుతోంది. పట్టాల మీద దూరంగా కాంతివలయం కనిపించగానే వొళ్ళు విరుచుకున్నట్టు కాస్తంత కదలిక. అది ఏదో గూడ్సో కావడం, మళ్ళీ ఆవలించి చిటికెవేసి నోరు నొక్కుకున్నట్లు స్టేషన్లో నిశ్శబ్దం. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. పంకాలు తిరుగుతూనే ఉన్నాయి. అయినా శ్యామసుందరికి విసుగ్గా వుంది. మనసులో ఏమిటో దిగులు లాటిది అప్పుడప్పుడు తెరలు తెరలుగా గత జీవితానుభవాల యవనికను తొలగిస్తున్నది. వద్దన్న కొద్దీ ఆ నిర్లిప్తత నర్తకి నర్తిస్తున్నది. విసుగనిపిస్తే, కోపంవస్తే ఏంచేస్తుంది శ్యామసుందరి? ముప్పై ఆరేళ్ళుకూడా నిండాయి. తల్లి లేదాయె. ఉంటే ఇంత దిగులనిపించకపోవును. తానెక్కడో చదివిందో, ఎవరో అంటే విన్నదో అది చాలా నిజమనిపిస్తున్నది. ఎన్నేళ్లొచ్చినా తల్లీదండ్రీ ఉంటే అలాటి భాగ్యవంతులు ఇంకా చిన్నపిల్లలే నట. యవ్వనంలో ఉన్నట్లేనట. తనకి చిన్నతనం మరిరాదు, యవ్వనం వెళ్ళిపోయింది.

సెకండ్ క్లాస్ వెయిటింగ్ రూమ్ అంత రద్దీగా ఏమీలేదు. చాలా నిశ్శబ్దంగా మటుకు ఉంది అందుకుతోడు రాత్రి.బండి మూడు గంటలు లేటన్న విసుగు. అయితే ఒక దృశ్యం మాత్రం చాలా కాలక్షేపం కలిగిస్తున్నది.

చిన్నపిల్లలు, చంటిపాపలు, నెలల కూనలు పగలంతా నిద్ర పోయి రాత్రంతా మేలుకొంటారు అనేది అమ్మ. వెడనవ్వు నవ్వుకొంది శ్యామసుందరి. ఎదురుగా వెయిటింగ్ రూములో అవతల బెంచీమీద

ఆ చివర ఓ అమ్మాయి కూచునివుంది. పచ్చని పసిమి. బారెడు జడ. ముఖాన్ని చిన్నవి చేసే బారెడేసి కళ్ళు. ఊ విసుక్కుంటుందేం చెప్మా! నిద్రవొస్తున్నదేమో. పనసతొనలాటి, బంగారం బిస్కెట్టులాంటి, లంకలో పుట్టాల్సినటువంటి ఒక పదినెలల రాక్షసి ఆ ఇరవై ఏళ్ళ బంగారు బొమ్మని నానాహైరానా పెట్టేస్తున్నది. తనకు గనక అలాటి పిల్లలు పుడితే ఎవరికైనా ఇచ్చేస్తుందేమో - అంత కోపంగా వుంది శ్యామసుందరికి. ఏమిటో చెప్పదు! చెప్పడానికి పదినెలల పాపకు మాటలొస్తాయా? తనకామాత్రం కూడా తెలిసేడిస్తేగా! తానే అడిగింది ఎన్నోనెల అని. ఆ అమ్మాయి ముక్తసరిగా పదోనెల అని చెప్పింది. ఆ అమ్మాయి చిన్న తమ్ముడు కాబోలు పదేళ్ళవాడు అక్కని రైలెక్కించటానికి వచ్చాడు. బెంచీమీద కూచుని కునికిపాట్లు పడుతున్నాడు. బుజ్జగించి చెప్పి అక్క వాణ్ణి ఇంటికి పంపించేసింది! తన దగ్గరో చిన్న సూట్‌కేసూ, పాలడబ్బా, తువాళ్ళు పెట్టిన ప్లాస్టిక్ సంచీతప్ప మరేమీ సామాన్లులేవు గదా, కంపార్ట్‌మెంట్ ఎక్కగలను, రేపే ఉత్తరం రాస్తాను అని పదే పదే చెప్పి తమ్ముణ్ణి పంపించివేసిందా అమ్మాయి. ఇక ఆ వెయిటింగ్ రూములో శ్యామసుందరీ, ఆ అమ్మాయి ఇద్దరే మిగిలారు.

విజయనగరం రైల్వేస్టేషన్ ఊరికి దూరం. తాను తమ్ముడినీ, వాళ్ళపిల్లల్ని చూడటానికి వచ్చింది. పది రోజులైపోయింది. మరదలు ఇంకో పది రోజులుండు వొదినా అని ఎంతగానో ప్రాధేయ పడింది. కాని తనకు ఉండ బుద్ధిపుట్టలేదు. నెలవైతే ఉంది కాని ఎందుకో అక్కడ మరి ఉండబుద్ధి పుట్టలేదు. అత్తా అత్తా ఈ వారం వుంటే మేమూ వస్తాం అని వెంటపడ్డారు పిల్లలు. అందుకే బయలు దేరిందేమో! ఛా ఛా-అలాటిదేమీలేదు, అని నవ్వుకొంది శ్యామసుందరి. పిల్లలకి పరీక్షలు లేకపోతే ఆ గుంపంతా తనకి సెండాఫ్ ఇవ్వడానికి

స్టేషన్‌కి వచ్చేవాళ్ళే. ప్లాట్‌ఫారమంతా తిరణాల అయిపోయి ఉండేది. అబ్బ ఏం అల్లరిబాబు! వాళ్ళమ్మకెంత ఓర్పో! శ్యామసుందరి కను కొలుకులు తడి అయినాయి. అవును, అమ్మ అంటేనే ఓర్పు. పిల్లలు చాలా మటుకు పాపిష్టి పనులు చేస్తూనే ఉంటారు. తానుమటుకు తాను అమ్మ ఓర్పుని ఎంతగా పరీక్షించింది. ఇంకా ఇంకా ఓర్పు చూపడానికి ఇప్పుడామెలేదు.

బుజ్జి రాక్షసి నానా చీదర చేసుకుంటూ అమ్మ ఓర్పుకి పుటం పెడుతున్నది. ఇట్లా ఇవ్వండి పాపను అని అడిగితే, ఆ అమ్మాయి అలవోకగా నవ్వింది. ఇవ్వలేదు. ఇంకెవరైనా భరింపగలరా అని భయమేమో! మీ కంపార్ట్‌మెంట్ ఏ నెంబరు అని అడిగింది. సీటు నెంబరు అడిగింది. అమ్మయ్య అన్న సంతోషం కనపడిందా అమ్మాయి ముఖంలో. తానూ హైదరాబాదే వెళ్తోంది. తాము మారేడ్‌పల్లిలో ఉంటారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగిపోతుంది. ఆయన వస్తారు స్టేషన్‌కు. పుట్టిల్లు విజయనగరమే. ఆయన హెచ్. ఎమ్. టి. లో పని చేస్తారు. తానూ చదువుకుంది. బ్యాంకులో పనిచేస్తున్నదట. అత్త గారున్నారు. ఈ రాక్షసి నావిడకి ఇచ్చేస్తుంది. ఇదీ ఆ పిల్ల శ్యామ సుందరికి ఆవలింతలు రాకుండా చెప్పిన చిన్నకథ.

జానపద చిత్రాల్లో మర్రిచెట్టు కొమ్మమీది నుంచి బేతాళుడు ఊడిపడ్డట్టుగా రైలు వచ్చేసింది పెద్దగా అరుచుకుంటూ.

ఇద్దరూ కంపార్ట్‌మెంట్ ఎక్కి సీట్లు చూసుకున్నారు. సరిగ్గా ఎదురుగా లేవుగాని ఆ పక్క అరలోనేవుంది ఆ అమ్మాయి సీటు. కార్నర్‌సీటు వచ్చింది కాబట్టి సదుపాయంగానే వుందా అమ్మాయికి. వెంటనే రైలు కదిలింది. శ్యామసుందరికి కిందిబెర్తే వచ్చింది కాబట్టి పక్క అరలో ఎదురుగా మూలసీటు మీద ఉన్న ఆ అమ్మాయి కన

పడుతూనే వుంది. మెత్తగా రజాయి పరచి దానిమీద శాలువవేసి అందు మీద ఒక టవలు పరచి పాపను పడుకోబెట్టింది. కాని పాప అందుకే మాత్రమూ వొప్పుకోలేదు. గంయ్‌న తన చిరాకు ప్రదర్శిం చింది. విస్తుపోయింది చిన్నతల్లి. తానుకూడా సర్దుకొని పడుకొంటే వెచ్చగా కరుచుకొని పడుకొంటుందేమో అని ఊహించింది. అంచేత పాపం అటు వొదిగి ముడుచుకొని పడుకోబోయింది. కాని ఆ రాక్షసి వింటేగా! కాళ్ళూచేతులూ చిరాగ్గా కదిలిస్తూ వొకటే అభినయం ప్రదర్శి స్తోంది. సీటుమీద కూచుని ఒళ్ళో పడుకోబెట్టుకొని ఒడినే ఉయ్యాల చేసింది. ఆ పిల్ల కిక్కురుమనలేదు.చూశావా నీ తిక్క ఎట్లా కుదిర్చానో అని తల్లి ముఖంలోకి చూసి గొప్పగా, కొంటెగా కవ్విస్తున్నట్లు చూస్తున్నది. పాపా, బుజ్జీ, అమ్మడూ, పన్నెండూ ముప్పావయింది, కాసేపు బజ్జో అని రాగాలు చెపుతోంది తల్లి.

శ్యామసుందరికి విసుగ్గా వుంది. నిద్రపట్టడంలేదు. రైలు ప్రయాణంలో తనకి సాధారణంగా నిద్రపట్టదు. అన్నిటికన్నాపై బెర్త్ వస్తే అదొకబాధ. కిందబెర్త్ వస్తే అదొక ఇబ్బంది. నిద్రపట్టకపోతే కూచుందామన్నా వీలుండదు. ఆ అమ్మాయి పేరేమిటో తానడగలేదు. పాపపేరు మాత్రం కాంతి అట. కాంతో శాంతో- ఇప్పుడు రెండక్షరాల పేర్లు,సినిమాపేర్లు ఫ్యాషనైపోయాయి.ఒత్తిగిలిచూసింది శ్యామసుందరి. తల్లిమాత్రం వెనక్కు జారబడి కూచునేవుంది. ఒకటి ఇరవై అయింది. తన సీటులోంచే చెప్పింది శ్యామసుందరి- నెమ్మదిగా ఒకమూల పడుకో బెట్టి మీరుకూడా కాస్త నడుంవాల్చండి అని.ఆ అమ్మాయి అసహాయంగా నవ్వింది. తల్లి అంతపనీ చేస్తుందనుకొన్నదో ఏమో, పాపలేచి మారాం ప్రారంభించింది. రోజూ ఇంతేనా అని అడిగింది శ్యామసుందరి. ఆ అమ్మాయి నవ్వింది. ఇంచుమించు ఇంతే. లయగా ఒడిని ఊపు తోంది తల్లి. పాప కిక్కురుమనకుండా శాంతించింది. 'నాకు నిద్ర

లాభంలేదు, పోనీ నా దగ్గరుంచుకుంటాను. కాసేపిలా ఇవ్వండి' అని అడిగింది శ్యామసుందరి లేచికూచుని ముందుకువొంగుతూ.'లాభంలేదు. మా అత్తగారి దగ్గరే ఉండదు.మా అమ్మ ఎంతో సేవ చేసింది ఈ పదిహేనురోజులూ. ఆయనా ఎత్తుకోవడానికి చూస్తారు, మధ్యరాత్రి మేల్కొని సైరన్ వినిపించగానే. కానీ అమ్మే కావాలి అమ్మ' అని చెప్పింది గర్వంగా ఆ తల్లి. శ్యామసుందరి వాచీ చూసుకుంది. రెండైంది. ఎవరో బాత్‌రూమ్‌లోకి వెళ్ళడానికి లేచి వింతగా చూస్తూ ముందుకి వెళ్ళారు.

శ్యామసుందరికి నవ్వొచ్చింది- రాత్రిళ్ళు కూడా ఈ చిన్న రాక్షసి "సీన్" సృష్టిస్తుందని చెప్పినందుకు.

తనకలాటి బాధలేదు. అది బాధా! ఏమో తనకేంతెలుసు? మరి అమ్మ ఎంత బాధపడి వుండాలి తమకోసం. ముగ్గురు ఆడపిల్లల్నీ, ఇద్దరు మగపిల్లల్నీ పెంచిపెద్ద చేసి చదువులు చెప్పించింది. అయితే పెద్దతనాన ఆమె ఎక్కడా ఇమడలేక పోయింది. తనకి ఎనిమిదేళ్ళు వచ్చిందాకా నాన్నగారున్నారట కాని తనకే మాత్రమూ ఆయన గుర్తు లేరు. తనకంటే పెద్దవాళ్ళు ఇద్దరు అక్కలు, తన తర్వాత ఇద్దరూ తమ్ముళ్ళు. తాను మంచిపని చేసిందో చెడ్డపని చేసిందో ఇప్పుడేమీ చెప్పలేదు. ప్రేమించానని చెప్పి రిజిస్టర్‌పెళ్ళి చేసుకొని వచ్చేసింది అమ్మని వదిలిపెట్టి. అక్కలకి కోపం. తమకన్నా సుఖపడిపోతుందని అసూయ- అనుకుంది శ్యామసుందరి అక్కలను గూర్చి! అప్పుడు అమ్మ చాలా బాధపడింది. ఆడపిల్లలకి పెళ్ళికాదన్న బాధలేదుగా, నీ మగపిల్లలకు పెళ్ళికాదన్న బెంగ నీకేమీ అక్కర్లేదు. అక్కల సంసారాలు ఎంత సొగసుగా ఉన్నాయో నాకు తెలుసు. సంఘంలో మార్పు రావాలి, మార్పు తేవాలి. అంతా రాతంటే నేను వొప్పుకోను. రాధామనోహర్ ఫైన్ జెంటిల్మన్- నా తమ్ముళ్ళని నేను చదివించి

పైకి తీసుకొని వస్తాను అని వాదించింది శ్యామసుందరి. అమ్మ పాత కాలపు మనిషి. అందుకు వొప్పుకోలేదు చాలా బాధపడింది. దుఃఖ పడింది. "నీకు నచ్చిన సంబంధమే చేస్తాను.క్రమంగా రావాలి మార్పు. ఒక్కసారి వస్తే నేను తట్టుకోలేను. నీ పిల్లల్ని వాళ్ళిష్టమొచ్చినట్టూ నీ ఇష్టమొచ్చినట్టూ పెంచుకుందువుగాని.నా మాట విను.నన్నిట్టా దాటి పోనీ అని బతిమాలుకుంది. కాని తాను వినలేదు. తాను చిన్నపిల్లననీ, తండ్రినెరగననీ, ఎంతప్రేమ కురిపించేది అమ్మ! ఆమె చెప్పినట్టు వినివుంటే తనదగ్గరే ఉండేదేమో అమ్మ! తన కిప్పుడు పదిహేడొందలు జీతం వస్తుంది. రాధామనోహర్ ఆ జీతం కోసం ఎదురుచూస్తుంటాడు. అతడి ప్రపంచం వేరు, అతడి సరదాలు వేరు. కాలక్షేపాలు వేరు. పిల్లలు లేరన్న బెంగ అతడికేమాత్రమూ లేదు. మరీబాగని అతడి అభిప్రాయం. ఖర్చులు వేరు.అతడికి లక్షరూపాయలు కట్నం వచ్చేది, ఈ శని మమ్మల్ని చుట్టుకొంది అని అతడివాళ్ళు తనని ఆదరంగా చూడరు. చీదరించుకుంటారు. దూరంగా వుంచుతారు. తన తమ్ముళ్ళు తనతో మాట్లాడరు. అక్కలు అయ్యో అనుకుంటారేమోకాని రారూ పోరూ. అమ్మకి కోపం, అసహనం, ఓడిపోయానన్న ఆత్మాభిమానం. తన నెవరో అపహసిస్తున్నారన్న భ్రమలతో తగూలమారి అయిపోయి వుంటుంది. తమ్ముళ్ళతో, తమ్ముళ్ళ పెళ్ళాలతో పడలేదు.

కీచుమన్న ఏడుపు వినపడితే విసుక్కుంటూ ఇటువేపు మళ్ళి చూసింది శ్యామసుందరి. పక్కఅరలో అమ్మాయి అలానే కూచుని వుంది. ఒడిని లయబద్ధంగా కదుపుతూవుంది. రాక్షసికి తన సౌకర్యంలో ఏ కొంచెం లోపం కన్పించినా ఊరుకోదు. మూడూ నలభైఅయిదు అయింది. ఆ అమ్మాయివసలే పెద్దపెద్ద కళ్ళు- బరువుని, బద్ధకాన్నీ నిద్రలేమినీ సూచిస్తూ ఉబ్బివున్నాయి. పడుకోలేదా అని అడిగింది. ఆ అమ్మాయి సిగ్గుగా నవ్వింది.

గిజిగాడిగూడేమో తల్లిఒడి- అది బ్రహ్మ కూడా నిర్మించలేడు. ఆ పోగులెలా అల్లుతుందో, ఆ గూడు ఎలా కడుతుందో ఆ బంగారు పిచ్చుకకు మాత్రమే తెలుసు.

మధ్యలో ఎక్కడెక్కడ ఎంత లేటయిందో సికింద్రాబాదు చేరే సరికి పది దాటింది. వాళ్ళయనకాబోలు హడావుడి పడుతున్నాడు ఆ అమ్మాయిని కంపార్ట్‌మెంటలో నుంచి అందుకోవడానికి. శ్యామసుందరి అంది "రాత్రి ఒక్కక్షణం కూడా కన్నుమూత పడనివ్వలేదు. తెగ పీక్కూనితింది. ఒకటే ఆగడం, నాకిచ్చే సెయ్యండి, పెంచి పెద్దయిన తర్వాత మీకే ఇచ్చేస్తాను. బాగా బుగ్గలు మెలిపెట్టి బుద్ధొచ్చేలా పెంచుతాను, ఏమంటారు?"అంది కళ్ళుతిప్పుతూ, ముక్కుపుటాలు ఎగరేస్తూ!

"అమ్మో, నా బంగారు తల్లిని విడిచి నేనుండటమే! నా వరాల మూట, నా కన్నతల్లి." నా బంగారు బొక్కలో వేలుపెడితే నేను కుట్టనా? అంటున్న చీమ కథలా ముక్తాయింపు.

కిటికీలోంచి ఆ బంగారు ముల్లెనందుకుంటున్న వీరుడు ముఖమంతా కళ్ళు చేసుకుని, కళ్ళంతా నోరు చేసుకుని పాపాయి బుగ్గకోసం తడుము లాడుకుంటున్నాడు అక్కడే అప్పుడే.

[బంగారు పిచ్చుకనే గిజిగా డంటారు. గిజిగాడి గూడు ఎంతో సొగసుగా ఉంటుంది. కాలువవొడ్లలో చల్లని చెట్లకొమ్మల్లో ఈ గూడు వేళ్ళాడదీసి కాపరాలు చేస్తాయి అవి. అమ్మఒడి అంత భద్రమైంది. అంత వెచ్చనిది. అలాటి వెక్కడా ఉండవు. ఎవరూ ఆ హాయిని ఇవ్వలేరు.]

(కలకత్తా ఆంధ్ర సంఘం ప్రత్యేక సంచిక - 1982)